పరిహారానికి పడిగాపులు



ఈ చిత్రంలోని వృద్ధురాలి పేరు లక్ష్మీదేవి. కుటుంబ సభ్యులతో కలిసి రజక వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. దాదాపు 40 ఏళ్లకు పైగా నివాసముంటున్నారు. రోడ్డు విస్తరణలో ఇళ్ల తొలగిస్తే ఎక్కడి వెళ్లాలో తెలియడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. పంపిణీ చేసే పరిహారం బట్టి ఎక్కడి వెళ్లాలో నిర్ణయించుకుంటామని తెలిపింది. అధికారులు స్పందించి త్వరగా పరిహారం అందజేయాలని ఆమె వేడుకుంది.



చురుగ్గా సాగుతున్న రోడ్డు విస్తరణ పనులు



పరిహారం చెల్లించకపోవడంతో నిలిపేసిన పనులు

- చురుగ్గా 544డీ హైవే పనులు
- పరిహారం అందక ఆందోళనలో బాధితులు

తాడిపత్రి రూరల్: రోడ్డు కోసం భూములు కోల్పోయిన రైతులు పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. వివరాలు.. తాడిపత్రి మండలంలోని తాడిపత్రి– అనంతపురం రోడ్డులో 544 డీ హైవే పనులు చురుగ్గా జరుగుతున్నాయి. పలు చోట్ల ఈ రోడ్డును విస్తరిస్తున్నారు. మరి కొన్ని చోట్ల కొత్తగా రోడ్డు వేస్తున్నారు. విస్తరణ, కొత్త రోడ్డు పనుల కోసం అవసరమైన భూసేకరణ చేశారు. ప్రస్తుతం పనులను వేగంగా చేయిస్తున్న ఆధికారులు అదే స్థాయిలో బాధితులకు పరిహారం అందించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. అప్పట్లో భూసేకరణ కోసం సర్వే జరిపిన అధికారులు పనులు ప్రారంభం కాక మునుపే పరిహారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. పనులు ప్రారంభమై రెండేళ్లయినా.. ఇంతవరకూ పరిహారంపై అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వడం లేదు. పరిహారం పంపిణీ చేయాల్సిన ప్రాంతాలను వదిలి మిగిలిన చోట్ల పనులు జరుగుతున్నాయి. యర్రగుంటపల్లి సమీపంలో పరిహారం ఇవ్వనిచోట పనులు అర్ధంతరంగా నిలిపివేశారు. పనుల పర్యవేక్షణకు వచ్చిన అధికారులను బాధితులు కలసి మొరపెట్టుకుంటే తమ పరిధి కాదని చెబుతున్నారు.

రూ. 6.70 కోట్లు పరిహారం కోసం ఎదురుచూపు

అధికారుల అంచనా ప్రకారం తాడిపత్రి మండలంలో రూ.6.70 కోట్ల పరిహారం కోసం బాధితులు ఎదురు చూస్తున్నారు. ఇందులో రోడ్డు విస్తరణలో భాగంగా మండలంలోని యర్రగుంటపల్లి, రావివెంకటాంపల్లి గ్రామాల పరిధిలో 74 ఇళ్లకు రూ.2,83,89,927, 19.91 ఎకరాల భూమితో పాటు అందులోని పంట, బోర్లు, పైపులు తదితర వాటి కోసం పరిహారం కోసం రూ.3,95,22,188 మంజూరు చేశారు. ఈ నిధులు అధికారుల వద్ద ఉన్నాయి. తాడిపత్రి– అనంతపురం ప్రధాన రహదారిలో భాగంగా అనంతపురం నుంచి పెద్దపప్పూరు మండలం పరిధిలోని భూసేకరణకు సంబంధించిన నిధులను బాధితులకు పంపిణీ చేశారని, తాడిపత్రి మండలంలో పరిహారం మంజూరులో ఎందుకు జాప్యం చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే యర్రగుంటపల్లి వద్ద గల ప్రధాన రోడ్డు విస్తరణలో భాగంగా ఆంజనేయ స్వామి విగ్రహం తొలగింపునకు అధికారులు అంచనాలు తయారు చేశారు. గతంలో గ్రామస్తులు లక్షలాది రూపాయలు ఖర్చుచేసి దాదాపు 40 అడుగులకు పైగా ఆంజనేయస్వామి విగ్రహం, కల్యాణ మండపాన్ని నిర్మించారు. ప్రస్తుతం రోడ్డు విస్తరణలో భాగంగా ఆంజనేయ స్వామి విగ్రహాన్ని తొలగించేందుకు సర్వే పనులు పూర్తయ్యాయని స్థానికులు తెలిపారు.

రెక్కాడితే కానీ డొక్కాడని పేదలు

యర్రగుంటపల్లిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న వారందరూ పేదలే. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి. రోడ్డు విస్తరణలో భాగంగా వారందరూ నిరాశ్రయులు కానున్నారు. రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారులు ఉన్నారు. వారిలో వెల్డింగ్, సిమెంట్ వ్యాపారం తదితర పనులు చేసుకునేవారు బంకులు, బండల మిద్దెలు, రేకుల షెడ్లు కలిగి ఉన్నారు. వ్యవసాయ పనులు చేసుకుని జీవనం కొనసాగించేవారున్నారు. వీరందరికి కాస్తో కూస్తో పరిహారం అందచేసి వదిలించుకోవాలని అధికారులు చూస్తున్నారు. భూసేకరణ సమయంలో చెప్పిన మొత్తాల కంటే రెండింతలు ఇస్తామని ఆశ పెట్టిన నాయకులు, అధికారులు ప్రస్తుతం మొదటికే మోసం తీసుకువస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పరిహారం త్వరగా అందజేయాలని బాధితులు వేడుకుంటున్నారు.

30 ఏళ్లుగా వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నా



రోడ్డు పక్కన వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నాను. యర్రగుంటపల్లి కాటన్ మిల్లులో తండ్రి పనిచేసేవారు. మిల్లు మూతపడటంతో ఉద్యోగం పోయింది. కుటుంబ పోషణ కోసం 30 ఏళ్ల కిందట వెల్డింగ్ షాపు పెట్టుకున్నాను. రోడ్డు విస్తరణలో షాపును తొలగించనున్నారు. అరకొర పరిహారం ఇస్తే ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– హరి, బాధితుడు

50 ఏళ్లుగా ఉంటున్నాం



రోడ్డు పక్కన బండల మిద్దెలో 50 ఏళ్లుగా ఉంటున్నాం. అప్పట్లో నివాస స్థలం కింద పేపరు ఇచ్చారు. ప్రస్తుతం ఆ పేపరు చూపిస్తే ఎక్కువ మొత్తం పరిహారం ఇస్తామంటున్నారు. అప్పట్లో ఇచ్చిన పేపరు కనపడలేదంటే అరకొర పరిహారం ఇస్తామని, ఖాళీ చేయాలని అధికారులు చేపుతున్నారు. ఈ వయస్సులో ఎక్కడి వెళ్లాలో తెలియడం లేదు.

– పక్కీరమ్మ, బాధితురాలు

రెండింతల పరిహారం ఇవ్వాలి



అధికారులు చెప్పిన విధంగా అంచనా కంటే రెండింతల పరిహారం ఇస్తే తప్ప ఇళ్లను తొలగించడానికి అంగీకరించం. ప్రస్తుతం సెంట్ రూ.లక్షలు పలుకుతోంది. అధికారులకు తక్కువ మొత్తానికి ఎందుకు ఇస్తాం. పూర్తి మొత్తం చేతిలో పెట్టిన తరువాత ఇళ్లను ఖాళీ చేస్తాం. పరిహారం కోసం సంవత్సరాల తరబడి వేచి చూస్తున్నాం.

– పుష్పవతి, బాధితురాలు

ఉన్నతాధికారులతో మాట్లాడతాం



పరిహారం జాప్యానికి గల కారణాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతా. నేను ఇటీవల బదిలీపై ఇక్కడకు వచ్చాను. బాధితులకు ఎంత మొత్తం పరిహారం అందాలో కిందిస్థాయి సిబ్బంతో మాట్లాడుతా. బాధితులకు న్యాయం జరగడానికి కృషి చేస్తా.

– రజాక్‌వలి, తాసీల్దార్

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ కరసేవకుల కవాతు



గుంతకల్లులో కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్/గుత్తి/పామిడి: : గుంతకల్లు పట్టణంలో స్వయం సేవక్‌లు కదం తొక్కారు. ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించి 99 సంవత్సరాలు పూర్తయి వందో వసంతంలోకి అడుగు పెడుతున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకుని కర సేవకులు ర్యాలీ చేశారు. హిందూ శక్తి జాగరణను తెలియజేయడానికి ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్ నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా పాతగుంతకల్లు బీరప్పగుడి వరకు కరసేవకులు గణవేష్ ధారణతో కవాతు(నగర పథ సంచలన్) నిర్వహించారు. కర్రల విన్యాసాలు, వాయిద్యా సంగీతం నడుమ ఎంతో క్రమశిక్షణతో కరసేవకులు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం బీరప్ప గుడి ఆవరణలో జరిగిన సభలో ముఖ్యవక్తగా హాజరైన సహప్రాంత బౌద్ధిక్ ప్రముఖ్ రామక్రిష్ణ హిందూ సనాతన ధర్మం, భారత దేశ సంస్కృతి, హిందూ జాగృతి గురించి వివరించారు. స్వయం సేవకులతో పాటు వివిధ బీజేపీ, వీహెచ్‌పీ, ఏబీవీపీ, బజరంగ్ దళ్ తదితర సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే గుత్తి, పామిడిలో ఆర్‌ఎస్‌ఎస్ కర సేవకులు భారీ ర్యాలీ నిర్వహించారు.

ఘనంగా ఆరాధనోత్సవం



ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్

పామిడి: మండలంలోని అన్ని చర్చీలలో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన ఆరాధన కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. దేవుని యందు భయభక్తులు గల కుటుంబాలు దీవించబడతాయన్నారు. క్రీస్తుకు మహిమకరంగా జీవించినప్పుడే మన జీవితాలు ధన్యకరమవుతాయన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు జయరాజు, అబ్రహాం, పీసీ రత్నరాజు, రాజు, ప్రసాద్, పాస్టరమ్మ సువర్ణమ్మ, మంజుల, ప్రిస్కిల్లా, డాక్టర్ కమల, మాణిక్యమ్మ, రెచెల్, మెర్సీ, మహిమ, రజని తదితరులు పాల్గొన్నారు.

‘కలెక్టర్ గ్రీవెన్స్’ సద్వినియోగం చేసుకోండి

గుంతకల్లురూరల్/పామిడి/పెద్దవడుగూరు: కలెక్టర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో గుంతకల్లులోని టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు గుంతకల్లు, పామిడి, పెద్దవడుగూరు తహసీల్దార్లు రమాదేవి, శ్రీధర్ మూర్తి, ఉషారాణి ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. గుంతకల్లు, పామిడి, గుత్తి, పెద్దవడుగూరు ప్రాంతాల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకవాలని వారు సూచించారు. మండలస్థాయిలో పరిష్కారానికి నోచుకోని సమస్యలను అర్జీల రూపంలో కలెక్టర్‌కు సమర్పించవచ్చన్నారు.

ఫిర్యాదుల విభాగానికి హాజరుకండి

యల్లనూరు: తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఇన్‌చార్జ్ తహసీల్దారు శేషారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యలున్న వారు అర్జీలందజేస్తే తక్షణమే పరిష్కరిస్తామన్నారు.

ప్రయాణం.. ప్రమాదకరం!



చెదుళ్ల నుంచి అనంతపురానికి ఆటోలో వెళ్తున్న ప్రయాణికులు

బుక్కరాయసముద్రం: ఆటోడ్రైవర్లు ఇష్టానుసారంగా ప్రయాణికులను తరలిస్తూ ప్రమాదాలకు గురి చేస్తున్నారు. ఆటోలో కూర్చొవడానికి స్థలం లేకున్నా...టాపుపై ప్రయాణికులను తీసుకెళ్తున్నారు. మండలంలోని రేగడి కొత్తూరు, పొడరాళ్ల, నీలాంపల్లి, జంతులూరు, చెదుల్ల, దండువారిపల్లి, కొడాపురం, ఓబులాపురం తదితర గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆటో డ్రైవర్లు గ్రామాల నుంచి నగరానికి పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్తున్నారు. అదే విధంగా శనివారం, ఆదివారం వచ్చిందంటే పశువులు, జీవాల కొనుగోలు కోసం ఆటోలు, వ్యాన్‌లపై ఎక్కి నగరంలోని మార్కెట్ యార్డుకు వస్తుంటారు. వీటిని కట్టడి చేయడంలో పోలీసులు విఫలమవుతున్నారని విమర్శలు వెలువెత్తుతున్నాయి. అధికారులు స్పందించి పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెల్లే ఆటోలు, ఇతర వాహనాల డ్రైవర్లపై చర్యలు తీసకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పామిడిలో ట్రాఫిక్ ఇక్కట్లు!

- ఇబ్బందుల్లో వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



పామిడిలోని పాతబస్టాండ్ వద్ద ఇలా..



మెయిన్‌బజార్ ఇరుకుమయమైన దృశ్యం

పామిడి: పామిడి పాతబస్టాండ్‌లో జనం సంచారం ఎక్కువ. దీనికితోడు పాతబస్టాండ్ పరిధిలో అన్ని రకాల దుకాణాలున్నాయి. దీంతో ఆ ప్రాంతం నిత్యం జనంతో రద్దీగా ఉంటోంది. దీనికి తోడు ఊర్లకు వెళ్లే ప్రయాణికులు బస్సుల కోసం ఇక్కడే ఎక్కువగా వేచి ఉంటారు. అలాగే స్థానిక ఎద్దులపల్లి రోడ్డులోని అంబేడ్కర్ సర్కిల్ గ్రామీణ ప్రాంతాల ప్రజలతో కిక్కిరిసి ఉంటుంది. దీంతో అనంతపురం, గుత్తివైపు వెళ్లే బస్సులు ఒకేసారి వస్తే ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఎదురెదురుగా అవి నిలబడితే రోడ్లపై ఉన్న తోపుడుబండ్లు ఇతరత్రా వాటి వల్ల పాదచారులు, వాహనచోదకులు వెళ్లలేని పరిస్థితి. దీంతో పాదచారులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

మెయిన్ బజార్ ఇరుకుమయం

పామిడికి వస్త్ర వ్యాపారంలో రెండో ముంబాయిగా పేరు. ఇక్కడి వస్త్రాలకు మన్నికతో పాటు సరసమైన ధరలకు లభిస్తుండడంతో డిమాండ్ ఎక్కువ. మెయిన్‌బజార్‌లో వంద దాకా వస్త్ర దుకాణాలు, ఇతరషాపులు ఉన్నాయి. అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి వచ్చి వస్త్రాలు కొని తీసుకెళ్తుంటారు. ఇక్కడి చీరెలు, ప్యాంటింగ్, షర్టింగ్, పంజాబీ డ్రెస్సులు, జాకెట్ పీసులు, నైటీలు, దారాలకు మంచి గిరాకీ ఉంది. ఇక్కడ హోల్‌సేల్‌లో కొని వారి ప్రాంతాల్లో వస్త్ర దుకాణాలు ఏర్పాటు చేసుకుని జీవనాధారం సాగించేవారు ఎక్కువ. ఇలాంటి కొనుగోలుదారులతో మెయిన్ బజార్ కిక్కిరిసి ఉంటోంది. మెయిన్‌బజార్ పొడవునా ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. బజార్‌లోని కాలువలపై నిర్మించిన కట్టల వల్ల రోడ్డు కుంచించుకు పోయింది. దీంతో ఇరుకుమయమైన ఈ బజారులో ఒక ఆటో వస్తే మరో వాహనం వెళ్లాలంటే ఫీట్లు చేయాల్సి వస్తోంది. వస్త్ర, ఇతరత్రా దుకాణాలకు బేల్‌లు, ఇతరత్రా లోడ్, అన్‌లోడ్ చేసే వాహనాలతో మెయిన్‌బజార్ చక్రబంధంగా మారుతోంది. దీంతో పాదచారులు, వాహనచోదకులు, కొనుగోలుదారులు ఇబ్బది పడుతున్నారు. అక్రమ కట్టడాలు తొలగించి రాకపోకలకు సుగమం చేయాల్సిన అవసరమెంతైనా ఉంది.

ట్రాఫిక్‌కు అంతరాయం



పామిడి మండల కేంద్రం గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలతో నిత్యం రద్దీగా ఉంటోంది. దీనికితోడు రోడ్డు పొడవునా షాపులు, తోపుడుబండ్లు, ఇతరత్రా దుకాణాల వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. జనసంచారం అధికంగా ఉన్న పాతబస్టాండ్, ఎద్దులపల్లిరోడ్డు సర్కిళ్ల వద్ద ఎదురెదురుగా బస్సులు నిలుపుతున్నారు. ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

–పీ వరప్రసాద్, పామిడి

మెయిన్ బజార్‌లో ఫీట్లు చేయాల్సిందే



మెయిన్ బజార్ పొడవునా వస్త్ర దుకాణాలు ఉన్నాయి. కొనుగోలుదారులతో నిత్యం రద్దీగా ఉంటోంది. బజార్ పొడవునా ద్విచక్ర వాహనాల పార్కింగ్ ఉంటోంది. దీంతో ఒక ఆటో వస్తే మరో వాహనం వెళ్లడం తీవ్ర కష్ట తరమవుతోంది. డ్రైనేజీ కాలువలపై కట్టలు ముందుకు వచ్చి నిర్మించడంతో మెయిన్ బజార్ మొత్తం కుంచించుకుపోయింది.

–వీ బుజ్జిబాబు, పామిడి

అక్రమ కట్టడాలను తొలగిస్తున్నాం



పామిడి బీసీసీ రోడ్డుకు గల అక్రమ కట్టడాల తొలగింపు ముమ్మరంగా చేపడుతున్నాం. ఇప్పటికే డ్రైనేజీ కాలువలపై నిర్మించిన కట్టడాలన్నింటినీ జేసీబీలతో తొలగింపజేశాం. ట్రాఫిక్‌కు అంతరాయంగా మారిన రోడ్లపై ఉన్న తోపుడు బండ్ల సైతం తొలగింపజేశాం. తోపుడుబండ్ల నిర్వాహకుల జీవనోధారం కోసం త్వరలో పంచాయతీ స్థలంలో వాటి నిర్వహణకు ఏర్పాట్లు చేయనున్నాం.

–ఎం.గోపాల్, ఈఓ, పామిడి

క్లుప్తంగా

కర్ణాటక కోర్టు తీర్పు హర్షణీయం



మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

గుంతకల్లు రూరల్: కర్ణాటక రాష్ట్రంలో దళితులపై జరిగిన దాడిలో 98 మందికి జీవితఖైదు శిక్షను విధిస్తూ తీర్పును వెలువరించడం హర్షణీయమని దళిత సంఘాల నాయకులు అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సీ,ఎస్టీ సంఘాల నాయకులు మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రం, కొప్పల్ జిల్లా, మరకుంబీ గ్రామంలో 2014లో అగ్రవర్ణాల వారు దళిత వాడపై దాడి చేసి అనేకమంది దళితులపై దాడులు చేశారని, ఇళ్లను సైతం తగుల బెట్టారన్నారు. పది సంవత్సరాల పాటు విచారణ జరిపిన కోర్టు దళితులపై దాడి జరిగినట్లుగా నిర్ధారించి, దాడులకు పాల్పడిన 98 మంది అగ్రవర్ణాల వారికి జీవితఖైదు విధించిందన్నారు. ఈ కేసు విచారణలో ఎంతగానో కృషి చేసిన పోలీసు శాఖ, న్యాయశాఖకు దళిత సంఘాల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం

తాడిపత్రి అర్బన్: అక్రమంగా విక్రయిస్తున్న అక్రమ మద్యాన్ని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్టు చేశారు. పట్టణంలో అక్రమ మద్యాన్ని విక్రయిస్తున్నారన్న సమాచారాన్నందుకున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో శివాలయం సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న గన్నెవారిపల్లికి చెందిన అడవిరెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 40 విస్కీ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



పోలీసులకు పట్టుబడిన జూదరులు

పెద్దవడుగూరు: మండలంలోని మేడిమాకులపల్లిలో చింతచెట్టు కింద ఆదివారం పేకాట ఆడుతున్న 11 మందిని ఎస్ఐ ఆంజనేయులు తన సిబ్బందితో కలసి అరెస్ట్ చేశారు. గ్రామంలో పేకాట ఆడుతున్నట్లుగా సమాచారం రావడంతో సిబ్బందితో కలసి ఎస్ఐ దాడి చేశారు. ఈ సందర్భంగా 11 మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.11,520 నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

శింగనమల: ప్రజాసమస్యల పరిష్కారమే సీపీఎం లక్ష్యమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రాంభూపాల్ అన్నారు. మండలంలోని నిదనవాడలో ఆదివారం సీపీఎం మండల మహాసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు, రైతులు, ఉపాధి కూలీలు, కార్మికుల సమస్యలపై పోరాటం చేయాలన్నారు. రైతులకు పంట నష్ట పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, పెట్టుబడి రాయితీ రూ.20 వేలు కోసం పోరాటం చేయాలన్నారు. అనంతరం పార్టీ మండల కార్యదర్శిగా భాస్కర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా సుంకన్న, సూర్య ప్రకాష్, ఆంజనేయులు, ఓబిరెడ్డి, శ్రీనివాసులు, నాగేంద్ర, వెంకటస్వామి, కొండారెడ్డి, రామాంజినేయులు, జయరాముడు, లక్ష్మీ నారాయణ, కుళ్లాయిస్వామి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బాలరంగయ్య, ఓ.నల్లప్ప, మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ భర్త మృతి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

పామిడి: మండలంలోని పాళ్యం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ గుర్రం సుమిత్రమ్మ భర్త, టీడీపీ సీనియర్ నాయకుడు గుర్రం నారాయణస్వామి ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్సీ వై శివరామిరెడ్డి తదితరులు ఆ గ్రామానికి వెళ్లి మృతదేహం వద్ద నివాళులర్పించారు. మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ కే నారాయణరెడ్డి, సర్పంచ్‌లు రామాంజనేయులు, పెమ్మక చంద్రశేఖర్‌రెడ్డి, టీడీపీ మండల ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్, మండల కన్వీనర్ ముసలిరెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ కత్రిమల ప్రభాకర్‌చైదరి, మాజీ ఎంపీటీసీలు బొల్లు శ్రీనివాసులురెడ్డి, జింకల సంజీవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

10 శాతం రిజర్వేషన్ కేటాయించాలి

శింగనమల: ప్రభుత్వ ఉద్యోగాల్లో దివ్యాంగులకు 10 శాతం రిజర్వేషన్ కేటాయించాలని హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ కోరారు. ఆయన శింగనమలలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ దివ్యాంగులకు హౌసింగ్, ఆరోగ్య బీమా, పింఛన్లు, ట్రై సైకిళ్లు, నాలుగు చక్రాల వీలర్లు, బైక్స్, ఉపాధి , ప్రభుత్వ పథకాలు మంజూరు చేయాలన్నారు. దివ్యాంగులకు పెళ్లి కానుక కింద రూ.5 లక్షలు మంజూరు చేయాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో దివ్యాంగులకు ప్రత్యేక గదిని కేటాయించాలన్నారు. రైలు పాస్ వంద శాతం, 10వ తరగతి నుంచి పీజీ వరకూ చదివిన దివ్యాంగులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు.

నారాయణుడికి ప్రత్యేక పూజలు



అలంకరణలో శింగబట్టు , గణపతి, నారాయణస్వామి

పెద్దపప్పూరు: మండలంలోని చిన్నపప్పూరు గ్రామ సమీపంలో వెలసిన అశ్వత్థనారాయణస్వామికి ఆదివారం అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. క్షేత్రంలో ఎక్కువ సంఖ్యలో వివాహాలు, కేశఖండన కార్యక్రమాలు ఉండడంతో వివిధ ప్రాంతాలనుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మెక్కులు చెల్లించుకున్నారు.

‘కోటంక’లో ప్రత్యేక పూజలు



గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకుపూజ, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సీపీఎం మండల కమిటీ ఏకగ్రీవం

పామిడి: పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం సీపీఎం నూతన మండల కమిటీ ఎంపిక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆ పార్టీ సీనియర్ నాయకుడు పీ అనిమిరెడ్డి అధ్యక్షతన నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా కే మల్లేసు, సభ్యులుగా డీ శంకర, ఆర్ ముత్యాలు, సాబిరా, ఆనంద్, లాజర్, బీ ఆనంద్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ పేదలు, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు



గాయపడిన హుస్సేన్, షాషావలి, రాజేంద్ర

గుత్తి: గుత్తి పట్టణంలోని ఆదివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. పట్టణంలోని జెండా వీధి సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ప్రమాదంలో బసినేపల్లికి చెందిన హుస్సేన్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. అలాగే వాసవీ బజారులో ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ కొన్నాయి. ఘటనలో గుత్తికి చెందిన వెల్డర్ షాషావలి తీవ్రంగా గాయపడ్డాడు. అదేవిధంగా మండలంలోని ఎంగిలి బండ గ్రామ సమీపంలో 67వ జాతీయ రహదారిపై ఐచర్ వాహనం ఢీ కొని ద్విచక్ర వాహనంలో ఉన్న గుత్తి పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన రాజేంద్ర తలకు బలమైన గాయమైంది. స్థానికులు గుత్తి ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం రెఫర్ చేశారు. ఘటనలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కొప్పలకొండలో పూర్వ విద్యార్థుల సమ్మేళన దృశ్యం

గార్లదిన్నె: మండలంలోని కొప్పలకొండ జిల్లా పరిషత్ హైస్కూల్లో 2006లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అప్పటి తీపి గుర్తులను నెమరువేసుకుని సంతోషంగా గడిపారు. అనంతరం అనాటి ఉపాధ్యాయులు నారాయణరెడ్డి, కాశింబి, వెంకటలక్ష్మిని పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు.